క్లుప్తంగా

నేడు మహా అన్నసమారాధన

బిక్కవోలు: ఏడాదిలో మహాశివరాత్రి రోజు మాత్రమే భక్తులకు దర్శన భాగ్యం కల్పించే బిక్కవోలు కేదారేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి మహా అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. కార్యక్రమానికి భక్తులంతా హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

అడబాలను సత్కరించిన జిత్‌మోహన్‌మిత్ర



మరిడియ్యకాపును సత్కరిస్తున్న సినీ నటుడు జిత్‌మోహన్‌మిత్ర

రంగంపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 160 సంవత్సరాల చరిత్ర ఉన్న రంగంపేట ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శనివారం పలువురిని సన్మానించారు. వివిధ పుస్తకాలు, పోటీ పరీక్షల మోడల్ పేపర్లు సేకరించి వాటిని విద్యార్థులకు అందించి విద్యను ప్రోత్సహిస్తున్న రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామానికి చెందిన అడబాల మరిడియ్యకాపును ప్రముఖ సినీనటుడు జిత్‌మోహన్‌మిత్ర చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో బ్యాంకు సేవలు

ఎస్‌బీఐ హెడ్ ఛీఫ్ మేనేజర్ లక్ష్మీకాంతారావు



పెదపూడిలో లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న బ్యాంక్ అధికారులు

పెదపూడి: స్థానికులకు అందుబాటులోకి తీసుకొస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవల్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ కాకినాడ హెడ్ ఛీఫ్ మేనేజర్ లక్ష్మీకాంతారావు అన్నారు. పెదపూడిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెదపూడి బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో సాయంకాలం సభ శుక్రవారం రాత్రి జనార్దనస్వామి ఆలయం వద్ద స్థానిక బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మునేంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మునేంద్ర మాట్లాడుతూ ఎస్‌బీఐ బ్యాంక్ ప్రజల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం ఎస్‌హెచ్‌జీ లబ్ధిదారులకు డ్వాక్రా రుణాలుగా రూ.20 కోట్ల చెక్కును ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రాంతిపథం ప్రతినిధులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు ప్రాజెక్టు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థి సూర్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయురాలు రూన్సీ

గోకవరం: మండలంలోని మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం ఎస్‌వీవీ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో రాజమహేంద్రవరం శ్రీసత్యసాయి గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో మల్లవరం హైస్కూల్ విద్యార్థి ఆర్.సూర్యనారాయణ సైన్స్ ఉపాధ్యాయురాలు కె.రూన్సీ పర్యవేక్షణలో రూపొందించిన ఇకో ఫ్రెండ్లీ కాస్ట్ మంకీ స్కేరర్ డివైజ్ (ప్రాజెక్టు)రాష్ట్రస్థాయికి ఎంపికైంది. అలాగే ఈ ప్రదర్శనలో సైన్స్ ఉపాధ్యాయురాలు రూన్సీ సైతం జిల్లా ఉత్తమ సైన్స్ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విద్యార్థితో పాటు సైన్స్ ఉపాధ్యాయురాలు రూన్సీని హెచ్‌ఎం, ఎంఈఓ బి.గౌరమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ధవళేశ్వరం: రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఎస్‌బీఐ అమరావతి ప్రధాన కార్యాలయం ముఖ్య కార్యనిర్వహణాధికారి క్రిషన్‌శర్మ, ఎస్‌బీఐ రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయ అధికారి జంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి ధవళేశ్వరంలోని స్వర్ణ మోహన్ కల్యాణ మండపంలో స్థానిక ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో సంధ్యా శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాధికారి జంగారెడ్డి టి.రావు, శాఖాధికారి ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన క్రిషన్‌శర్మ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని శాఖల ద్వారా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.12 కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



సీతానగరం శివాలయంలో ఉమారామలింగేశ్వర స్వామివారు



అనపర్తి మార్కండేయపురం భావనారుషి ఆలయంలో స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



అనపర్తి పాతఊరు శివాలయంలో స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



జి.మామిడాడలో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

హరోం హర.. భక్తవశంకర



బిక్కవోలులో ప్రత్యేక అలంకరణలో కేదారేశ్వరస్వామి



వంగలపూడి రేవు వద్ద భక్తుల కోలాహలం



వంగలపూడి రేవు నుంచి ట్రాక్టర్‌పై పట్టిసీమకు వెళ్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి

- కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు

రాజానగరం: హరోం హర.. భక్తవశంకరా అంటూ ఆ మహా దేవునిని భక్తజనం కొలిచింది. సదా స్మరిస్తూ తరించింది.. శనివారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో శైవ క్షేత్రాలు భక్తులతో శోభిల్లాయి. రాజానగరంలోని రాజలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. దివాన్‌చెరువు ఆగమ ఆశ్రమంలోని కాశీఅన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, జాతీయ రహదారిని ఆనుకుని నరేంద్రపురం జంక్షన్ వైపు ఉన్న ఈతచెట్టు ఈశ్వరుడు, వివిధ గ్రామాల్లో శివాలయాలకు భక్తుల తాకిడి ఉంది. సంపత్‌నగరంలోని పర్వతవర్ధనీ శివనాగేశ్వరునికి శుక్రవారం రాత్రే కల్యాణోత్సవం నిర్వహించారు. దివాన్‌చెరువులోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద నిర్మించిన నమూనా ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు దర్శించుకున్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేసేందుకు కృషి చేస్తున్న సీఎం జగన్‌కి అవసరమైన మరో బలాన్ని, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పలు శైవక్షేత్రాలలో ప్రత్యేక అభిషేకాలు చేయించారు. నియోజకవర్గంలోని అనేక శివాలయాలతో పాటు పట్టిసీమలోని వీరభద్రస్వామిని దర్శించుకుని, సీఎం జగన్ దంపతుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పశ్చిమగానుగూడెంలోని బ్రహ్మంగారి గుడి ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్రలో పాల్గొన్నారు. కణుపూరులోని భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం గైట్ కళాశాలలో చైర్మన్ చైతన్యరాజు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష ఒత్తుల వ్రత మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, నన్నయ ఇన్‌చార్జి వీసీ ప్రసాదరాజు పాల్గొన్నారు.

నడిచి వచ్చేము.. నిను చూసేము

సీతానగరం: వీరభద్రస్వామిని కొలిచేందుకు భక్తజనం కదిలివచ్చింది.. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలో ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రుని దర్శనానికి వంగలపూడి, రామచంద్రపురం రేవుల నుంచి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. వంగలపూడి రేవు నుంచి గోదావరి పాయపై వేసిన నడక మార్గం ద్వారా, రామచంద్రపురం రేవు నుంచి నేరుగా ట్రాక్టర్లపై భక్తులు పట్టిసీమకు వెళ్లారు. వంగలపూడి గోదావరి పాయపై నడక మార్గం నుంచి రాత్రి పది గంటల వరకూ 70 వేల మంది భక్తులు వెళ్లినట్లు అంచనా. రామచంద్రపురం రేవు నుంచి ట్రాక్టర్ల ద్వారా రాత్రి పది గంటల వరకూ 25 వేల మంది వెళ్లారని అధికారులు చెబుతున్నారు. ఈ ఏర్పాట్లను తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, ఎంపీడీఓ కె.రమేష్, నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ రేఖపల్లి సుజాత, పంచాయతీ కార్యదర్శి నాగసతీష్, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ తదితరులు పర్యవేక్షించారు. ఆయా రేవులలో ఉచిత భోజన ఏర్పాట్లు చేశారు. డాక్టర్ ఎస్.రాజు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. కాటవరం, మునికూడలి, ముగ్గళ్ల, సీతానగరంలో శివాలయాల్లో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వామివార్లను దర్శించుకుని సీఎం జగన్ దంపతుల పేరున ప్రత్యేక పూజలు చేశారు. వంగలపూడి రేవు వద్ద నుంచి పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి ట్రాక్టర్‌పై వెళ్లారు. మధ్యాహ్నం అన్న సమారాధనలో పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అనపర్తి: హర హర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమః శివాయ.. అంటూ భక్తుల శివ పంచాక్షరి నామస్మరణతో మండలంలోని శైవ క్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే గోదావరి నదీజలాల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ముక్కంటిని దర్శించుకునేందుకు ఆలయాల వద్ద పెద్ద ఎత్తున బారులు తీరారు. ఈ సందర్భంగా పరమశివునికి నమక చమకాలతో విశేష అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. దుప్పలపూడి చంద్రశేఖర స్వామి, పెదపర్తి కంచికామకోటి పీఠాధిపతి చేతుల మీదుగా ప్రతిష్ఠించబడిన పార్వతీ రామలింగేశ్వరస్వామి, పొలమూరు పార్వతీ రామలింగేశ్వరస్వామి, అనపర్తి పాత ఊరులోని పార్వతీ ఉమారామలింగేశ్వరస్వామి తదితర శివాలయాల్లో లయకారుడుకి భక్తులు విశేష పూజలు జరిపారు.

భీమేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం జి.మామిడాడ గ్రామం శివారు ఎల్ఎన్‌పురంలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారిని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. రథోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులను ఉంచిన పల్లకీని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు మోశారు. అనంతరం రథోత్సవాన్ని వారు ప్రారంభించారు. రథోత్సవం కనుల పండువగా పుర వీధుల్లో సాగింది. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ లంక మున్ని, వైస్ ఎంపీపీ ద్వారంపూడి వెంకటరెడ్డి, చింతా దొరబాబు అండ్ ఫ్రెండ్స్, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: మహాశివరాత్రి సందర్భంగా రంగంపేటలోని ఉమా రామలింగేశ్వర స్వామి, బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఆలయంలో తెల్లవారు జాము నుంచే స్వామి వారికి అభిషేకాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారికి నంది, సింహ, ఏకాదశ హారతులు నిర్వహించారు. అనంతరం 1008 సహస్ర దీపారాధన చేశారు. చంద్రేడు కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా స్వామి, అమ్మవార్లను అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి

గోకవరం: మహాశివరాత్రి పర్వదినాన్ని గోకవరం మండల ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని శివాలయాలు తెల్లవారు జాము నుంచి శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు శివలింగాలకు అభిషేకాలు చేసేందుకు ఆయా ఆలయాల వద్ద బారులు తీరారు. గోకవరంలోని రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి, ప్రధాన రహదారి పక్కన ఉన్న పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయం, సోమేశ్వరస్వామి, కొత్తపల్లిలో సుమారు 300 సంవత్సరాల చరిత్ర ఉన్న రెడ్డిరాజుల కాలం నాటి బాలత్రిపుర సుందరీ దేవి సమేత రాజలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తంటికొండ, గాదెలపాలెం గ్రామాల మధ్య పుష్కర కాలువ చెంత ఉమాచంద్ర మౌళేశ్వరస్వామి, తంటికొండలో అఖిలాండేశ్వరి సమేత జంబుకేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి పలు ఆలయాల వద్ద పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

పెదపూడి/బిక్కవోలు: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని పెదపూడి మండలంలోని శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. జి.మామిడాడ గ్రామం శివారు ఎల్ఎన్‌పురంలో భీమేశ్వరస్వామి, వారి ఆలయం వద్ద సుమారు 10 వేల మందికి భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సంపర వీక్షణ ముక్తేశ్వరస్వామి, పైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఆలయాల్లో స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బిక్కవోలులో మహాశివరాత్రి సందర్భంగా ఏడాదిలో కేవలం ఒక రోజు మాత్రమే దర్శనం భాగ్యం కల్పించే ప్రాచీన కేదారేశ్వరస్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఊలపల్లిలో అగస్త్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

మధురపూడి: కణుపూరులో భ్రమరాంబిక సహిత మల్లిఖార్జున స్వామి ఆలయం, గాదరాడలో ఓం శివశక్తి పీఠంలో ప్రత్యేక పూజలు చేశారు. కాపవరంలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను సత్కరిస్తున్న గైట్ విద్యా సంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు




జి.మామిడాడ శివారు పాటి మీద విద్యుత్ అలంకరణలో భీమేశ్వరస్వామి ఆలయం



ఊలపల్లిలో అగస్త్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

ఎలుక చిన్నది.. నష్టం తీరనిది

- వరి పొలాలపై మూషికాల దాడి
- ఆందోళనలో రైతన్నలు



ఎలుకల దాడిలో దెబ్బతిన్న పొలం

పెదపూడి: రైతు కష్టాన్ని ఎలుకలు కొరికి పడేస్తున్నాయి.. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు ఉపద్రవంలా మారాయి.. రైతన్నలకు నష్టాలు తెచ్చిపెడుతున్నాయి. ఈ రబీలో వీటి బెడద ఎక్కువగా ఉందని పుడమి పుత్రులు వాపోతున్నారు. ఎలుకల నివారణకు బుట్టలు పెట్టించినా, వాటిని పట్టించినా, నివారణ మందు బొరియల వద్ద పెట్టినా ఉధృతి తగ్గడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం చిరుపొట్ట దశకు వరి పంట చేరుకుంటోంది. ఎలుకల తీవ్రతతో దిగుబడులపై ప్రభావం పడనుంది. సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం మంచిదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని మొత్తం ఏడు మండలాల్లో రబీలో 57,442 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అనపర్తి మండలంలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2 వేలు, బిక్కవోలులో 13 వేలు, కోరుకొండలో 2,465, సీతానగరం మండలంలో 1,917 ఎకరాలు, రాజానగరం మండలంలో 8,060 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా సుమారు 5 నుంచి 8 శాతం వరకూ ఎలుకల దాడిలో పంట నాశనం అవుతుంది. ఒక ఎలుక జీవిత కాలం రెండేళ్లు. ఆడ ఎలుక పుట్టిన ఐదు వారాలకే పిల్లలను కనే శక్తి సంతరించుకుంటుంది. ఒక కాన్పులో సగటున ఏడు పిల్లలు పుడతాయి. ఎలుక పళ్లు రోజుకు 0.3 మిల్లీ మీటర్లు పెరుగుతాయి. వాటిని అరగదీసుకోకపోతే కొద్ది రోజుల్లో దాని నోరు మూత పడదు. దీంతో రోజులో ఎక్కువ భాగం ఏదోక దానిని కొరుకుతూనే కాలాన్ని గడుపుతాయి. వరి పంట కాలంలో ఎలుకల సంతానోత్పత్తి ఎక్కువగా ఉండి పొలాలపై ఇవి దాడి చేస్తున్నాయని వ్యవసాయాధికారులు అంటున్నారు.

ఎకరాకు ఎంత నష్టమంటే..

ఎకరం పొలంలో 25 నుంచి 30 వరకూ ఎలుక బొరియలు ఉండి, సుమారు 10 నుంచి 15 శాతం వరకూ పంటను ఎలుకలు నష్టపరుస్తాయని అంచనా. వీటి నిర్మూలనకు ఎకరాకు ఒక్కో రైతుకు సుమారు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకూ ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు.

పట్టుకుంటే రూ.100

ఎలుకలకు తెలివి తేటలు ఎక్కువ ఉంటాయని, వాడే మందు వాసనను, ఎరలను పసిగట్టి వాటికి ఆమడ దూరం వెళ్లిపోతున్నాయని రైతులు వివరిస్తున్నారు. ఒక్కో ఎలుకను పట్టి చంపినందుకు రూ.100ను వేటగాళ్లు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో పెద్దాడ, రామేశ్వరం, కాండ్రేగుల, శహపురం, కరకుదురు, జి.మామిడాడ, పెద్దాడ, సంపర తదితర గ్రామాల్లో రైతులు పొగ, బుట్టలు ద్వారా ఎలుకలను నిర్మూలించే చర్యలు చేపడుతున్నారు.



పెద్దాడలో బొరియలను తవ్వి ఎలుకలను పట్టుకుంటున్న వేటగాళ్లు

ఆందోళన చెందవద్దు



సామూహిక ఎలుకల నిర్మూలనతోనే ఫలితం ఉంటుంది. రైతులు ఆందోళన చెందవద్దు. ఈ నెల 16 నుంచి రైతులందరికీ ప్రభుత్వం ఉచితంగా సమకూర్చిన బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేపట్టాం. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి రైతులు తగిన చర్యలు చేపట్టాలి.

–టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయాధికారి, పెదపూడి